

లండన్ పర్యటనలో ఘనస్వాగతం పలికిన పీడీఎస్ఎల్ ప్రతినిధులు, ఎన్ఆర్ఐలు, తెలంగాణ ప్రవాసులు, బీఆర్ఎస్ అభిమానులతో కేటీఆర్




న్యూజెర్సీలో సన్నాహక సమావేశంలో కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యేలు బాల్క సుమన్, గాదరి కిశోర్, క్రాంతికిరణ్, పార్టీ నాయకుడు గ్యాదరి బాలమల్లు, రోజా మాధవరం తదితరులు

# కేటీఆర్‌కు గ్రాండ్ వెల్‌కం

మొదటిపేజీ తరువాయి...

కేటీఆర్.. సాయంత్రం లండన్ చేరుకున్నారు. తమ అభిమాన నాయకుడికి స్వాగతం పలకడానికి తెలంగాణ ప్రవాసులు పెద్ద ఎత్తున ఎయిర్‌పోర్ట్‌కు తరలివచ్చారు. 'వెల్ కం కేటీఆర్' అంటూ భారీ బ్యానర్‌ను విమానాశ్రయంలో ప్రదర్శించారు. ప్రాగ్ మ్యాటిక్ డిజైన్ సొల్యూషన్ లిమిటెడ్ (పీడీఎస్ఎల్) కంపెనీ డైరెక్టర్ల బృందం, వారి కుటుంబసభ్యులు ఎయిర్‌పోర్ట్‌కు వచ్చి కేటీఆర్‌కు స్వాగతం పలికారు. తనకు స్వాగతం పలకడానికి వచ్చిన వారిని పేరుపేరునా కేటీఆర్ పలకరిస్తూ ధన్యవాదాలు తెలియజేశారు. ఎన్నారైలు కేటీఆర్‌తో సెల్ఫీలు దిగి ఆనందం వ్యక్తంచేశారు. ఈ నెల 30న బ్రిడ్జ్ ఇండియా ఆధ్వర్యంలో లండన్‌లో జరిగే ఇండియా వీక్‌– 2025లో కేటీఆర్ ప్రధాన ఉపన్యాసం ఇవ్వనున్నారు. వివిధ దేశాలకు చెందిన పలువురు రాజకీయ నాయకులు, ప్రభావశీల వ్యక్తులు పాల్గొనే ఈ సమావేశంలో తొమ్మిదేండ్ల బీఆర్ఎస్ పాలనలో అభివృద్ధి కేంద్రంగా సాగిన పాలన, ఆలోచనలు అద్భుత ఆవిష్కరణలుగా మారిన విధానంతోపాటు తెలంగాణ విజయ ప్రస్థానాన్ని కేటీఆర్ వివరించనున్నారు. అనంతరం మెక్‌లారెన్, ఆస్టన్ మార్టిన్, జాగ్వార్ ల్యాండ్ రోవర్ వంటి దిగ్గజ ఆటోమోటివ్ కంపెనీలకు ఆర్ అండ్ డీ సేవలను అందించే పీడీఎస్ఎల్ నాలెడ్జ్ సెంటర్‌ను కూడా ప్రారంభించనున్నారు. యూకే పర్యటనలో భాగంగా వివిధ దేశాలకు చెందిన మేధావులు, రాజకీయ నాయకులు, విద్యార్థులను కలువనున్నారు.



నార్త్ కరోలినాలోని హోలీ స్ప్రింగ్, రాలీ యూనిట్‌లో సన్నాహక సమావేశంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే నోముల భగత్, టీటీజీపీ అధ్యక్షురాలు భారతి వెంకన్నగారి

### యూఎస్‌ఏలో కేటీఆర్ షెడ్యూల్

అమెరికాలో తెలంగాణ ఎన్నారైలు నిర్వహించనున్న పలు కార్యక్రమాల్లో కేటీఆర్ పాల్గొననున్నారు. జూన్ 1న టెక్సాస్ లోని ఫ్రిస్కోలోని కొమెరికా సెంటర్‌లో నిర్వహించనున్న తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు, బీఆర్ఎస్ 25 ఏండ్ల రజతోత్సవంలో పాల్గొంటారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ ఉద్యమానికి మద్దతుగా నిలిచిన వేలాది మంది ఎన్నారైలు హాజరుకానున్నారు. జూన్ 2న యూనివర్సిటీ ఆఫ్ టెక్సాస్ డాలస్ (యూటీ డాలస్)లోని భారతీయ విద్యార్థులను కేటీఆర్ కలుస్తారు. నూతన ఆవిష్కరణలు, ఆంత్రప్రెన్యూర్‌షిప్‌తోపాటు భవిష్యత్ భారత నిర్మాణంలో విద్యార్థుల పాత్ర గురించి కేటీఆర్ ప్రసంగించనున్నారు. కేటీఆర్ యూకే, యూఎస్‌ఏ పర్యటనపై అక్కడి ఎన్నారైలు, వ్యాపారవేత్తలు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ రెండు దేశాల్లోని తెలంగాణ ప్రవాసులు, ప్రవాస భారతీయులు, విద్యార్థులను కేటీఆర్ కలవబోతున్నారు. కేటీఆర్‌తోపాటు లండన్‌కు బయలుదేరి వెళ్లిన వారిలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యే చందర్, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దామోదర్, పెద్దపల్లి జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రఘువీర్‌సింగ్ ఉన్నారు.

### సందడి చేస్తున్న తెలంగాణ నేతలు

మంగళవారం ఆస్టిన్‌లో జరిగిన సన్నాహక సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్‌రెడ్డి, చల్లా ధర్మారెడ్డి, గండ్ర వెంకటరమణారెడ్డి, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి, ఎన్నారై సెల్ నేతలు అభిలాష్ రంగినేని, వంశీ కంచర్లకుంట్ల, శ్రీధర్‌రెడ్డి, వ్యాళ్ల హరీశ్‌రెడ్డి, వెంకట్ మంతెన, శ్రీనివాస్ పొన్నాల, శీతల్ గంపవరం, అరుణ్, వెంకట్‌గౌడ్ దుడాల, రాజ్ పడిగల, మల్లిక్, నవీన్ కనుగంటి, సుధీర్ జలగం, స్ఫూర్తి జితేంద్ర తదితరులు పాల్గొన్నారు. న్యూజెర్సీలో జరిగిన సన్నాహక సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు గాదరి కిశోర్, బాల్క సుమన్, క్రాంతికిరణ్ చంటి, పార్టీ ప్రధాన కార్యదర్శి గ్యాదరి బాలమల్లు, పార్టీ నాయకురాలు రోజా మాధవరం, బీఆర్ఎస్ వింగ్ నేతలు యుగంధర్, జక్కిరెడ్డి శ్రీనివాస్, రవి ధన్నపునేని, మహేశ్ పొగాకు తదితరులు పాల్గొన్నారు. నార్త్ కరోలినాలోని హోలీ స్ప్రింగ్, రాలీ యూనిట్‌లో జరిగిన సమావేశానికి మాజీ ఎమ్మెల్యే నోముల భగత్, టీటీజీపీ అధ్యక్షురాలు భారతి వెంకన్నగారి, ఎన్నారై నాయకులు చంద్ర ఎల్లపంతుల, కృష్ణ పెందోటి, మహిపాల్‌రెడ్డి, హరీశ్ కుందూర్, పున్నం కొల్లూరు, వీరేందర్ బొక్కా, శంకర్ రేపాల, అరుణజ్యోతి కట్క, శ్రీధర్ అంచూరి, రఘుయాదవ్, రాజు కటకం, శ్రీనాథ్ అంబటి, క్రాంతికుమార్ కటకం, ఉమేశ్ పరేపల్లి, హరి అప్పని, రాఘవరావు తదితరులు పాల్గొన్నారు. రానున్న రెండు మూడు రోజుల్లో హ్యూస్టన్, కాలిఫోర్నియా, డెలావేర్ తదితర పట్టణాల్లో సన్నాహక సమావేశాలు నిర్వహించనున్నారు. సమావేశానికి మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఎల్ రమణ తదితరులు హాజరుకానున్నారు.

### యూఎస్‌లో బీఆర్ఎస్ సందడి

**బీఆర్ఎస్** ఎన్నారై సెల్ ఆధ్వర్యంలో జూన్ 1న డాలస్‌లో రజతోత్సవం నిర్వహించనున్న నేపథ్యంలో తెలంగాణ బిడ్డలతోపాటు తెలుగువారు నివసిస్తున్న అమెరికా సంయుక్త రాష్ట్రాల్లోని ప్రధాన నగరాల్లో సందడి నెలకొన్నది. డాక్టర్ పెప్పర్ ఎరినాలో రాష్ట్ర అవతరణ వేడుకలు, బీఆర్ఎస్ రజతోత్సవాలను ఏకాలంలో నిర్వహించనున్నారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిథిగా పాల్గొనే ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు యూఎస్‌ఏలోని దాదాపు అన్ని ప్రధాన నగరాల్లో సన్నాహక సమావేశాలు జరుగుతున్నాయి. తెలంగాణ నుంచి వెళ్లిన బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు ఆయా సమావేశాల్లో పాల్గొంటూ, అమెరికాలోని వివిధ నగరాల్లో ఉంటున్న తెలంగాణ బిడ్డలను కలుస్తున్నారు. డాలస్ సభ కార్యక్రమాలను బీఆర్ఎస్ ఎన్నారై సెల్ కో–ఆర్డినేటర్ మహేశ్ బిగాల, బీఆర్ఎస్ ఎన్నారై యూఎస్‌ఏ అడ్వైజరీ బోర్డ్ చైర్మన్ మహేశ్ తన్నీరు సమన్వయం చేస్తున్నారు.




అమెరికాలోని ఆస్టిన్‌లో బీఆర్ఎస్ రజతోత్సవ సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న మహేశ్ బిగాల

# ఎన్డీఎస్‌ఏ నివేదిక.. నాటకమే!

- ఎల్ అండ్ టీ లేఖతో బయటపడ్డ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ డ్రామా
- మేడిగడ్డ బరాజ్‌కు ఎలాంటి పరీక్షలు చేయకుండానే ఎన్డీఎస్‌ఏ నివేదిక ఎలా ఇస్తుందన్న ఎల్ అండ్ టీ సంస్థ
- అస్పష్ట నివేదిక తప్పని మండిపాటు



హైదరాబాద్/సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, మే 27 (నమస్తే తెలంగాణ): కాళేశ్వరంలో భాగమైన మేడిగడ్డ బరాజ్‌లో ఒక పిల్లర్ కుంగుబాటుపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్డీఎస్‌ఏ భుజంపై తుపాకీ పెట్టి నాటకమాడుతున్నాయనేది మరోసారి బహిర్గతమైంది. పోలవరంలో డయాఫ్రం వాల్ కొట్టుకుపోయినా పనులను పునరుద్ధరించారు. కానీ ఇక్కడ కాంగ్రెస్ ప్రభుత్వం ఒక పిల్లర్ కుంగుబాటును బూచిగా పెట్టి, జలాల ఎత్తిపోతలనే అటకెక్కించింది. ఇదేమని అడిగిన ప్రతిసారీ ఎన్డీఎస్‌ఏ (నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ) నివేదికనే తమకు ప్రామాణికమంటూ ప్రభుత్వం చెప్తూ వచ్చింది. ఈ క్రమంలో బీఆర్ఎస్ రజతోత్సవ సభ ముందే వెలువడిన తుది నివేదికతో ప్రభుత్వ పెద్దలు కొంత హడావుడి చేశారు. తాజాగా అసలు ఆ నివేకదనే తప్పంటూ ప్రపంచ ప్రఖ్యాత నిర్మాణ సంస్థ ఎల్‌అండ్‌టీ కుండబద్దలు కొట్టింది. ఈ మేరకు ఈ నెల 24న ప్రభుత్వానికి లేఖ రాసింది. రాయడం చర్చనీయాంశమైంది.

### పొంతనలేని నివేదిక అంశాలు

మేడిగడ్డ బరాజ్‌పై ఎన్డీఎస్‌ఏ సమర్పించిన నివేదికలో అనేక అంశాలు పొంతన లేకుండా ఉన్నాయని, పరీక్షలు నిర్వహించకుండానే రిపోర్టు ఎలా ఇస్తారని ఎల్‌అండ్‌టీ, ఇతర ఏజెన్సీలు అభ్యంతరం వ్యక్తంచేశాయి. నిర్మాణం, నాణ్యత, ప్రాజెక్టుకు సంబంధించి ముందస్తు పరీక్షల నిర్వహణలో తాము ఎక్కడా రాజీ పడలేదని తేల్చి చెప్పాయి. అన్ని అంశాలను మరోసారి పరిశీలించి ఎన్డీఎస్‌ఏ నివేదికను సవరించాలని, తదుపరి చర్యలకు తగిన సిఫారసులు చేసేలా చూడాలని ఇరిగేషన్ శాఖను కోరాయి. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌లపై ఎన్డీఎస్‌ఏ రూపొందించిన తుది నివేదిక తమకు అందిందని, దాన్ని క్షుణ్ణంగా పరిశీలించామని వెల్లడించింది. అందులోని పలు అంశాల్లో ఎక్కడా పొంతన లేదని స్పష్టంచేసింది. ఫౌండేషన్ భూమిని అంచనా వేయలేకపోయారని, గ్రౌటింగ్ వల్ల బరాజ్ నిర్మాణాల పరిస్థితులు, స్థితిని సమర్థవంతంగా మార్చారని, తద్వారా రాఫ్ట్ కింద, సికెంట్ పైల్ కటాఫ్‌ల వెంట కీలకమైన సబ్–సర్ఫేస్ జియోటెక్నికల్ పరిస్థితులను కచ్చితంగా అంచనా వేయలేని పరిస్థితి కల్పించారని నివేదికలో పేర్కొనడాన్ని ఖండించింది. తాము క్వాలిటీ మేనేజ్‌మెంట్ ప్రోగ్రాం నిర్వహించామని, మేడిగడ్డ బరాజ్ నిర్వహణ పత్రాలను నిర్మాణ సంస్థ సమర్పించిందని, అది ప్రాజెక్ట్ నిర్వహణ బృందాలు ప్రాజెక్ట్ అమలు, నాణ్యతా ప్రమాణాలను పాటించేందుకు, నాణ్యత ప్రణాళిక, నాణ్యత నియంత్రణ, నాణ్యత హామీ విధానాలను ఏర్పాటు చేయడంలో సహాయపడుతుందని తెలిపింది. నాణ్యత నియంత్రణ లేదనే వాదనలను తోసిపుచ్చింది. ఎన్డీఎస్‌ఏ ప్రశ్నలకు సవివరమైన సమాధానాలను మరోసారి లేఖలో ప్రస్తావించింది. నాణ్యత నియంత్రణ మాన్యువల్‌ను ఇరిగేషన్‌శాఖకు సమర్పించామని, సికెంట్ పైల్ మెథడ్ స్టేట్‌మెంట్‌ను క్వాలిటీ మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్ ద్వారా రూపొందించామని, నిర్మాణ సమయంలో ఇరిగేషన్‌శాఖకు అది ఇవ్వడమేగాక, దానినే అనుసరించామని తెలిపింది. ఇరిగేషన్ శాఖ జారీ చేసిన కస్టమర్ సంతృప్తి నివేదికలు, థర్డ్ పార్టీ ద్వారా పరీక్షలు, ప్రయోగశాలల ద్వారా డిజైన్ మిక్స్, ఏజెన్సీ అంతర్గత ఆడిట్ ఫలితాలు, 7 రోజులు, 28 రోజులకు క్యూబ్ పరీక్ష ఫలితాలు అన్నీ సవ్యంగానే ఉన్నాయని వివరించారు. ఇవన్నీ ఎన్డీఎస్‌ఏ నివేదికలో వెల్లడించిన నాణ్యతపై నియంత్రణ లేదనే సొంత పరిశీలనను ఈ వాదనలు తోసిపుచ్చుతున్నాయని పేర్కొన్నది. తాము వెల్లడించిన అంశాలను మరోసారి పరిశీలించి ఎన్డీఎస్‌ఏ నివేదికను సవరించి ఇచ్చేలా చూడాలని ఎల్‌అండ్‌టీ కోరింది.

### పునరుద్ధరించే అవకాశం ఉన్నా.. ససేమిరా

**సాగునీటి** ప్రాజెక్టుల్లో ప్రమాదాలు సహజం. కానీ రాజకీయ బలిపీఠంపైకి వాటిని తెచ్చినపుడే ప్రజా ప్రయోజనం మంటగలిసిపోతుంది. ఇందులో భాగంగా ప్రపంచంలోనే అతి పెద్ద ఎత్తిపోతల పథకంగా రూపుదిద్దుకున్న కాళేశ్వరంపై కాంగ్రెస్ ప్రభుత్వ కక్షసాధింపు కూడా ఇలాగే తయారైంది. తొలుత కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, ఆపై రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కారు రాజకీయంగా మేడిగడ్డ పిల్లర్ కుంగుబాటును వాడుకోవడంతో ప్రాణహిత జలాల వినియోగం అటకెక్కింది. ఘటన జరిగిన గంటల వ్యవధిలోనే ఢిల్లీ నుంచి ఎన్డీఎస్‌ఏ ఇంజినీర్లు ఇక్కడికి వచ్చారు. కనీసం బరాజ్‌ను పరిశీలించకుండానే ప్రాథమిక నివేదిక ఇచ్చారు. అసెంబ్లీ ఎన్నికల సమయం కావడంతో బీజేపీ ప్రభుత్వమే ఇదంతా చేస్తున్నదని అప్పట్లో బహిరంగంగానే ఆరోపణలు వచ్చాయి. దానిని పునరుద్ధరించే అవకాశం ఉన్నా రేవంత్ సర్కారు ససేమిరా అంటూ వస్తున్నది. ఎన్డీఎస్‌ఏ తుది నివేదిక ఇచ్చే వరకు దాని జోలికి వెళ్లేది లేదంటూ సీఎం, మంత్రి కూడా ప్రకటించారు. ప్రాథమిక నివేదికను గంటల వ్యవధిలోనే ఇచ్చిన ఎన్డీఎస్‌ఏ తుది నివేదిక మాత్రం ఏడాన్నర అయినా ఇవ్వడం లేదు. ఈ క్రమంలో బీఆర్ఎస్ రజతోత్సవ సభ అంశాన్ని డైవర్ట్ చేయాలనే అక్కసుతో ఎన్డీఎస్‌ఏ తుది నివేదిక ఇచ్చిందనేది జగమెరిగిన సత్యం! ఆ నివేదికనే తమకు పరమావధి అన్న ప్రభుత్వం కొన్నిరోజుల పాటు బీఆర్ఎస్‌పై ఆరోపణలు చేసేందుకు వినియోగించింది. ఈ నేపథ్యంలో నిర్మాణ సంస్థ ఎల్‌అండ్‌టీ ప్రభుత్వానికి లేఖ రాయడం సంచలనం రేకెత్తించింది. ఎన్డీఎస్‌ఏ నివేదిక డొల్లతనాన్ని బట్టబయలు చేసింది.

# 'పోలవరం'పై దాగుడుమూతలు

మొదటిపేజీ తరువాయి...

మీడియా సమావేశంతో అది నిర్ధారణ అయ్యింది. ఈ కుట్రలను 'నమస్తే తెలంగాణ' ఎప్పటికప్పుడు బయటపెట్టింది. మరోవైపు పోలవరం, బనచర్లతో తెలంగాణకు వాటిల్లే నష్టంపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆదేశాలతో మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రజలకు వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను నిలదీశారు. ఈ నేపథ్యంలోనే ప్రగతి సమావేశం నుంచి పోలవరం ఎజెండాను తొలిగించినట్టు విశ్వసనీయవర్గాల ద్వారా తెలిసింది.



### కుట్రలను బయటపెట్టిన 'నమస్తే'..

పోలవరం డ్యామ్ ముంపు, భూసేకరణ, పునరావాసం, ప్రజాభిప్రాయసేకరణ తదితర అంశాలపై తెలంగాణ, ఒడిశా, చత్తీస్‌గఢ్ అభ్యంతరాలు వ్యక్తంచేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఆయా రాష్ట్రాలతో చర్చించేందుకు ప్రధాని మోదీ బుధవారం ఢిల్లీలో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించాలని నిర్ణయించారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఒక రాష్ట్రానికి చెందిన సాగునీటి ప్రాజెక్టుపై స్వయంగా ప్రధాని సమావేశం నిర్వహించడంపై విస్మయం వ్యక్తంచేశారు. దీనిపై లోతుగా అధ్యయనం చేస్తే భారీ కుట్రకు తెరలేపారని రాష్ట్ర సాగునీటి రంగ నిపుణులు గుర్తించారు. పోలవరం మాటున ప్రాణహిత సహా గోదావరి జలాలను తన్నుకుపోయేందుకు గోదావరి–బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టు ద్వారా చంద్రబాబు ప్లాన్ చేశారని విశ్లేషించారు. ఢిల్లీలో చంద్రబాబు మాట్లాడుతూ.. రూ.80వేల కోట్లతో బనకచర్ల ప్రాజెక్టును చేపడుతున్నామని, ఆర్థిక సహాయం కోసం కేంద్రానికి ప్రతిపాదనలు సమర్పించామని చెప్పడంతో కుట్ర నిజమేనని నిర్ధారించుకున్నారు. వరద జలాల ఆధారంగానే పోతిరెడ్డిపాడు చేపడుతున్నామంటూ నాడు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చెప్పినట్టే, ఇప్పుడు చంద్రబాబు కూడా వృథా జలాలే బనకచర్లకు ఆధారం అంటున్నారని, దీనిని బట్టే పోతిరెడ్డిపాడు మాదిరిగా గోదావరి నదిపై తెలంగాణకు బనకచర్ల ప్రాజెక్టు పిడుగుపాటుగా మారుతుందని గుర్తించారు. కేసీఆర్ ప్రభుత్వం నిర్మించిన కాళేశ్వరంపై కోపంతో రేవంత్ రెడ్డి ప్రభుత్వం మేడిగడ్డను రాజకీయ చట్రంలో ఇరికించిన సమయాన్ని చంద్రబాబు అదునుగా భావించి చక్రం తిప్పినట్టు చెప్తున్నారు. మరోవైపు తమిళనాడులోని కావేరీకి గోదావరిని అనుసంధానించేందుకు కాచుకు కూర్చున్న మోదీ ప్రభుత్వం ఇదే మంచి తరుణంగా భావించి రంగంలోకి దిగిందని అంటున్నారు. ఈ వ్యూహంలో భాగంగానే ఎన్డీఎస్‌ఏ నివేదిక పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం మేడిగడ్డ పునరుద్ధరణను అటకెక్కించినట్టు ఆరోపిస్తున్నారు. బనకచర్లను కేంద్రం–ఏపీ సంయుక్తంగా చెరిసగం నిధులతో పూర్తి చేసేందుకు అంతర్గతంగా నిర్ణయం జరిగినట్టు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఏపీ భరించే 50 శాతం నిధులను కూడా రుణం రూపంలో సేకరించేందుకు కేంద్రం సహకరించేలా అంగీకారం జరిగినట్టు సమాచారం. తద్వారా తెలంగాణకు దక్కాల్సిన గోదావరి జలాలను ఏపీ, తమిళనాడుకు మళ్లించేందుకు ప్రయత్నించినట్టు సాగునీటి రంగ నిపుణులు ఆరోపిస్తున్నారు. ఈ వ్యవహారాలపై 'నమస్తే తెలంగాణ' వరుస కథనాలను ప్రచురించి, కుట్రలను బహిర్గత చేసింది.

### జల హక్కులపై నిలదీసిన బీఆర్ఎస్

గోదావరి జలాలపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, ఏపీ సీఎం చంద్రబాబు కలిసి చేస్తున్న కుట్రలపై మాజీ మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. తెలంగాణ జలహక్కుల కోసం గళమెత్తారు. ఉమ్మడి పాలనలో సాగిన జలదోపిడిని వివరిస్తూ, నేడు కాంగ్రెస్ పాలనలో మళ్లీ మొదలైందని మండిపడ్డారు. అంతా ఒక పథకం ప్రకారం జరుగుతున్నదని తెలిసినా రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు అడ్డుకోలేదని ప్రశ్నించారు. తక్షణమే అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లి బనకచర్లను అడ్డుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఢిల్లీలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. అన్ని అనుమతులు ఉన్న కాళేశ్వరం ప్రాజెక్టు కోసం ఆర్ఈసీ, పీఎఫ్‌సీ నుంచి రుణాలు తీసుకొచ్చామని, ఎలాంటి అనుమతులులేని బనకచర్లకు కేంద్ర ప్రభుత్వం ఎలా రుణ సహాయం చేస్తుందని ప్రశ్నించారు. నిబంధనలు యథేచ్ఛగా ఉల్లంఘిస్తుంటే రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రులు, ఎంపీలు ఎందుకు మౌనంగా ఉంటున్నారని నిలదీశారు.

### ఏజెండా నుంచి పోలవరం తొలగింపు

నమస్తే తెలంగాణ వరుస కథనాలతో కుట్రలను బయటపెట్టడం, హరీశ్‌రావు పోరాటంతో పోలవరంపై కేంద్రం వెనకడుగు వేసినట్టు తెలిసింది. ప్రగతి సమావేశం ఏజెండా నుంచి పోలవరం ప్రాజెక్టు అంశాన్ని మొత్తంగా తొలగించడమే నిదర్శనంగా చెప్తున్నారు. పోలవరంతోపాటు ఎంఎస్ఎంఈ, దీన్‌దయాల్ రూరల్ లైవ్లీ హుడ్ మిషన్, ఆయుష్మాన్ భారత్ పథకాలపై ఆయా రాష్ట్రాల ప్రధాన ప్రధాన కార్యదర్శులు, శాఖల అధికారులతో వర్చువల్‌గా భేటీ కావాలని మోదీ భావించారు.ఈ నేపథ్యంలో సీఎస్ మంగళవారం ఆయా శాఖల అధికారులతో సమీక్షించారు. అయితే.. సమావేశం కొనసాగుతుండగానే ఎజెండా నుంచి పోలవరం అంశాన్ని తొలగించినట్టు సమాచారం వచ్చినట్టు తెలిసింది. రాజకీయంగా నష్టపోతామనే ఆలోచనతో వెనక్కి తగ్గినట్టుగా విశ్లేషకులు చెప్తున్నారు. ఇది తాత్కాలికమేనని, గుట్టుచప్పుడు కాకుండా పోలవరాన్ని కొనసాగించాలని భావిస్తున్నట్టు అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు.

# రూ.1,600 కోట్ల నుంచి 4 వేల కోట్లకు!

మొదటిపేజీ తరువాయి...

జూలై 23న అసెంబ్లీ సమావేశాల సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చిట్‌చాట్‌లో మాట్లాడుతూ.. ఒక్కో ఇంటిగ్రేటెడ్ స్కూల్‌పై రూ. 80 – 100 కోట్లు వెచ్చించాలని ప్రభుత్వం భావిస్తున్నట్టు చెప్పారు. గతేడాది అక్టోబర్ 12 రంగారెడ్డి జిల్లా కొందుర్గ్‌లో యంగ్ ఇండియా స్కూల్ నిర్మాణానికి సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. అనంతరం మాట్లాడుతూ.. 'రూ.125 నుంచి రూ.150 కోట్లతో స్కూల్‌ను నిర్మించి షాద్ నగర్ ప్రజలకు అందిస్తున్నాం' అంటూ సీఎం వ్యాఖ్యానించారు. కానీ విద్యాశాఖ ఇప్పుడు రూ.200 కోట్లుగా పేర్కొన్నది. డిప్యూటీ సీఎం ప్రకటించిన మూడు నెలల తర్వాత అంచనా వ్యయం 50 శాతం పెంచి సీఎం చెప్పగా, ఏడాది తిరిగే సరికి ఏకంగా రెట్టింపు అయ్యిందని బీఆర్ఎస్ నేతలు పేర్కొంటున్నారు. దీని వెనుక భారీ దోపిడీకి ప్లాన్ చేశారని ఆరోపిస్తున్నారు.

### చక్రం తిప్పిన ఆర్కిటెక్ట్..?

స్కూళ్ల నిర్మాణానికి నిర్ణయం తీసుకున్న తర్వాత కర్ణాటకకు చెందిన ఓ ప్రైవేట్ ఆర్కిటెక్ట్ కన్సల్టెన్సీ రంగప్రవేశం చేసినట్టు సమాచారం. ఆ సంస్థ డీపీఆర్‌ను తయారు చేసి ఒక్కో స్కూల్‌కు దాదాపు రూ.300 –350కోట్లు ఖర్చయ్యేలా నివేదిక సిద్ధం చేసిందన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. అయితే అంత మొత్తమంటే అనుమానాలకు తావిస్తుందన్న సూచనలతో రూ.200 కోట్లకు కుదించినట్లు సమాచారం. భట్టి చెప్పినట్టు రూ.80–100 కోట్లతో చేపట్టినా 20 స్కూళ్లకు రూ.1,600–2000 కోట్లు సరిపోయేవని, సీఎం చెప్పినట్టు రూ.125–150 కోట్లతో అనుకున్నా రూ.2,500–3000 కోట్లు అయ్యేవని అంటున్నారు. అలా కాకుండా రూ.200కోట్లకు అంచనాలు పెంచడంతో బడ్జెట్ రూ.4వేల కోట్లకు చేరిందని.. ఇది ముందస్తు అంచనాల కన్నా రెట్టింపు అని విశ్లేషిస్తున్నారు. తొలి దశలో త్వరలోనే రూ.7వేల కోట్లతో మరో 35 స్కూళ్లను, తర్వాత రూ.10వేల కోట్లతో మరో 50 స్కూళ్లను నిర్మిస్తామని ప్రభుత్వం చెప్తున్నది. మొత్తంగా రూ.21వేల కోట్లను ఖర్చుచేయనున్నారు. సీఎం, డిప్యూటీ సీఎం చెప్పిన లెక్కల ప్రకారం రూ.12–15వేల కోట్లతో పూర్తయ్యే నిర్మాణాలకు రూ.21వేల కోట్లు ఖర్చు చేసేందుకు సిద్ధమయ్యారని చెప్తున్నారు.

### యంగ్ ఇండియా స్కూల్ స్కామ్ - మన్నె క్రిశాంక్

యంగ్ ఇండియా స్కూళ్ల నిర్మాణం వెనుక కుంభకోణం ఉన్నదని బీఆర్ఎస్ నేత క్రిషాంక్ ఆరోపిస్తూ బుధవారం ఎక్స్‌లో పోస్ట్ చేశారు. మొదట రూ.80 కోట్లతో నిర్మాణాలు చేపడతామని, ఆ తర్వాత రూ.100 కోట్లకు పెంచారని, మళ్లీ రూ.125 కోట్లకు చేర్చారన్నారు. చివరికి ఒక్కో స్కూల్‌కు రూ.200కోట్లు కేటాయిస్తూ జీవో జారీ చేశారన్నారు. కమీషన్ల కోసమే రూ.1,600 కోట్లతో కట్టాల్సిన భవనాలను రూ.4వేల కోట్లకు పెంచారని ఆరోపించారు.

## లోకం పోకడ




షాపువాడికి ఎక్కడా లొంగకుండా ప్రతివస్తువు జాగ్రత్తగా చూసి కొన్నా.. అన్నీ మేడిన్ ఇండియానే!

## వానా కాలం

| | గరిష్ఠం | కనిష్ఠం |
|---|---|---|
| ఆదిలాబాద్ | 37.8°c | 23.2°c |
| రంగారెడ్డి | 37.0°c | 21.9°c |
| నిజామాబాద్ | 35.3°c | 26.1°c |
| వరంగల్ | 34.0°c | 24.0°c |
| మెదక్ | 34.0°c | 26.0°c |
| నల్లగొండ | 33.0°c | 25.4°c |
| ఖమ్మం | 32.0°c | 26.0°c |
| హైదరాబాద్ | 32.0°c | 23.3°c |
| కరీంనగర్ | 32.0°c | 26.0°c |
| మహబూబ్‌నగర్ | 31.0°c | 25.0°c |

## ఘనంగా రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు

**నాయకులు, శ్రేణులందరూ పాల్గొనాలి**

**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు**

హైదరాబాద్, మే27 (నమస్తే తెలంగాణ): తెలంగాణ భవన్‌తోపాటు, బీఆర్ఎస్ జిల్లా కార్యాలయాలు, నియోజకవర్గాలు, మున్సిపాలిటీలు, పట్టణాలు, మండలాల్లో జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు. జాతీయ జెండాను, పార్టీ పతాకాన్ని ఎగరేసి పెద్ద ఎత్తున సంబురాలు నిర్వహించాలని, పార్టీ సీనియర్ నేతలు, శ్రేణులంతా పాల్గొనాలని, ప్రజలతో కలిసి అవతరణ వేడుకలు జరపాలని కోరారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పద్నాలుగేండ్ల అలుపెరగని పోరాటంతో ఉద్యమ రథసారథి కేసీఆర్ సారథ్యంలో సాధించిన రాష్ట్ర ఆవిర్భావ వేడుకలను పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించాలని కోరారు. హైదరాబాద్‌లోని తెలంగాణభవన్‌లో జూన్ 2న పార్టీ వ్యవస్థాపక సభ్యులు, శాసనమండలిలో ప్రతిపక్ష నేత మధుసూదనాచారి పాల్గొని జాతీయ జెండాను, పార్టీ పతాకాన్ని ఆవిష్కరిస్తారని తెలిపారు. ఈ వేడుకల్లో పార్టీ సీనియర్ నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. అలాగే తెలంగాణవ్యాప్తంగా అన్ని జిల్లా పార్టీ కార్యాలయాల్లో పార్టీ అధ్యక్షుల ఆధ్వర్యంలో జాతీయ జెండాతోపాటు పార్టీ జెండాలను ఎగరేసి సంబురాలు జరపాలని కోరారు. అమరుల త్యాగాలు, ఉద్యోగులు, విద్యార్థుల పోరాటాలు, సబ్బండ వర్గాల కృషితోనే ఆరు దశాబ్దాల కల సాకారమైందని కేటీఆర్ గుర్తుచేశారు.

## కక్ష సాధింపు తప్పితే చేసింది ఏమీలేదు

**కేటీఆర్‌కు నోటీసుల జారీని ఖండించిన పల్లా**



చేర్యాల, మే 27 : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై ఏసీబీ నోటీసులు జారీ చేయడం కక్షసాధింపు చర్యలు మాత్రమేనని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. సిద్దిపేట జిల్లా చేర్యాలలో జరిగిన సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమం అనంతరం ఎమ్మెల్యే పల్లా మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ సర్కారు అధికారంలోకి వచ్చిన తర్వాత బీఆర్ఎస్ నాయకులపై కక్ష సాధింపులు చేయడం తప్పితే ప్రజలకు చేసింది ఏమీలేదని విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో స్పోర్ట్స్, గేమ్స్, ఈ కార్స్ రేసింగ్ వల్ల అంతర్జాతీయ స్థాయిలో హైదరాబాద్‌కు మంచి గుర్తింపు, వేలాది రూ. కోట్ల పెట్టుబడులు వచ్చాయని గుర్తుచేశారు. కేటీఆర్ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తుంటే సమాధానం చెప్పలేక డైవర్షన్ పాలిటిక్స్‌కు పాల్పడుతున్నట్టు ధ్వజమెత్తారు.

## కోలుకుంటున్న మహేశ్

**కాలుకు సర్జరీ చేసిన వైద్యులు**

**మీ రుణం తీర్చుకోలేనిదంటూ కేటీఆర్‌కు మేసేజ్**

సిరిసిల్ల రూరల్, మే 27: సౌదీలో జరిగిన ప్రమాదంలో గాయపడిన రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం మండెపల్లికి చెందిన మంద మహేశ్ కోలుకుంటున్నాడు. ఇటీవలే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రత్యేక చొరవతో సౌదీ నుంచి స్వదేశానికి తీసుకువచ్చి హైదరాబాద్ కిమ్స్ దవాఖానలో చేర్పించి వైద్యం చేయిస్తున్నారు. సోమవారం రాత్రి మహేశ్ ఎడమ కాలుకు వైద్యులు చేసిన సర్జరీ సక్సెస్ కావడంతో మూడు రోజుల్లో డిశ్చార్జి చేయనున్నారు. ఈ క్రమంలో మంగళవారం మహేశ్ కేటీఆర్‌కు ప్రత్యేకంగా మెసేజ్ చేశారు.'అన్నా.. మీ రుణం తీర్చుకోలేనిది.. మీకు, పార్టీకి జీవితాంతం రుణపడి ఉంటా.. పార్టీ కోసం పనిచేసినందుకు మరిచిపోలేని సహాయం చేశారు. మా కుటుంబ సభ్యులం మీకు రుణపడి ఉంటాం' అంటూ కృతజ్ఞతలు తెలిపారు. సొంత ఖర్చులతో స్వదేశానికి తీసుకువచ్చి, కిమ్స్‌లో మెరుగైన వైద్యం చేయించిన కేటీఆర్.. మహేశ్ కోలుకోగానే ఉపాధి చూపిస్తామని హామీనిచ్చారు.